
సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

మంగళవారం । 8 । జూలై । 2025



ప్రాణహిత పరవళ్లు..

మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతోకాళే శ్వరం వద్ద గోదావరితో కలిసి ప్రాణహిత నది వరద పరవళ్లు తొక్కుతోంది.

- 8లో▸



రైల్వే ఇన్‌చార్జ్ జీఎం తనిఖీ

కాజీపేట జంక్షన్‌లో సోమవారం దక్షిణ మధ్య రైల్వే ఇన్‌చార్జ్ జనరల్ మేనేజర్ సందీప్‌మథూర్ తనిఖీలు చేపట్టారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

29°/24°

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం నుంచి అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

కనులపండువగా స్నాతకోత్సవం

- ముందుగా అకడమిక్ సెనెట్ సమావేశం
- పీహెచ్‌డీ అభ్యర్థులకు పట్టాలు.. మరికొందరికి గోల్డ్‌మెడల్స్ ప్రదానం
- రెండు విభాగాల వరకు సవ్యంగానే.. ఆ తర్వాత గ్రూప్ ఫొటోలకే పరిమితం
- గవర్నర్‌తో సింగిల్‌గా ఫొటో దిగలేకపోయామన్న అసంతృప్తి..
- కాకతీయ యూనివర్సిటీలో పండుగ వాతావరణం



గవర్నర్ చేతులమీదుగా పట్టా అందుకుంటున్న దివ్యాంగుడు పి.శివకృష్ణ



స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, వేదికపై హైదరాబాద్ ఐఐసీటీ డైరెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రం, సెనేట్, పాలక మండలి సభ్యులు



రెండు గోల్డ్ మెడల్స్ అందుకున్న కూతురును ముద్దాడుతున్న తల్లి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం సోమవారం ఆడిటోరియంలో కనులపండువగా నిర్వహించారు. అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యుల రాకతో యూనివర్సిటీలో పండుగ వాతావరణం నెలకొంది. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఉదయం 11:30గంటలకు యూనివర్సిటీకి రాగా, ఆడిటోరియం వద్ద తొలుత ఎన్‌సీసీ కేడెట్స్‌తో గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆడిటోరియంలో అకడమిక్ సెనెట్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆరేళ్లకు సంబంధించి అన్నికోర్సుల ఫలితాలను అప్రూవ్ చేస్తూ వాల్యూమ్స్‌పై సంతకం చేశారు. సెనెట్ సభ్యులతో గ్రూప్‌ఫొటో దిగారు. అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ముఖ్యఅతిథి అయిన హైదరాబాద్ ఐఐసీటీ డైరెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రం, సెనెట్, పాలకమండలి సభ్యులతో కలిసి ఆడిటోరియంలోని వేదిక వద్దకు వచ్చారు. స్నాతకోత్సవాన్ని షెడ్యూల్ ప్రకారం నిర్వహించారు.

ఫార్మసీలో కొందరికి ఇచ్చాక హడావుడి..

కాకతీయ యూనివర్సిటీ 2020–2025 వరకు ఆర్ట్స్, సైన్స్, సోషల్ సైన్స్, ఫార్మసీ, ఇంజనీరింగ్, లా విభాగాల్లో పీహెచ్‌డీ అవార్డులు అయిన 387మందికి 374 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కొందరు గవర్నర్ చేతులమీదుగా తీసుకోగా, మరికొందరు గ్రూప్‌గా నలుగురైదుగురిని నిలబెట్టి ఫొటో దిగేలా చేయడంతో అభ్యర్థులు ఆవేదన చెందారు. తొలుత ఆర్ట్స్, సైన్స్ విభాగాల అభ్యర్థులకు పట్టాలందించారు. కొందరు ఫార్మసీ పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రదానం చేయగానే, సమయం తక్కువగా ఉందని, త్వరత్వరగా పూర్తిచేయాలని గవర్నర్ సెక్యూరిటీ సిబ్బంది.. డీన్‌కు పక్కకు తీసుకెళ్లి చెప్పారు. దీంతో నలుగురైదుగురిని ఒకేసారి పట్టాలు తీసుకొని అక్కడికి వచ్చి గవర్నర్, వీసీ పక్కన నిలబడి ఫొటోలు దిగేలా చేశారు. గవర్నర్‌తో పట్టా తీసుకొని ఫొటో దిగాలనుకున్నావారి కోరిక నెరవేరకుండా పోయిందని పలువురు అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

అభ్యర్థుల తల్లిదండ్రులకు భారీ స్క్రీన్..

అభ్యర్థుల తల్లిదండ్రులను ఆడిటోరియంలోకి అనుమతించలేదు. ఆడిటోరియం ఎదుట ఏర్పాటుచేసిన భారీ స్క్రీన్‌లో ఈ కార్యక్రమాన్ని తిలకించారు. పిల్లలు పట్టాలు, బంగారు పతకాలు తీసుకుంటుండడం చూసి సంతోషంవ్యక్తం చేశారు. కాగా, యూనివర్సిటీలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. స్నాతకోత్సవం ముగిశాక పీహెచ్‌డీ పట్టా లు, గోల్డ్‌మెడల్స్ పొందిన అభ్యర్థులు తమతమ కుటుంబసభ్యులు, స్నేహితులతో గ్రూప్ ఫొటోలు దిగారు. మరికొందరు పట్టాలతో సెల్ఫీలు తీసుకుని సంతోషంలో మునిగిపోయారు.

బంగారు పతకాలు..

పీహెచ్‌డీ అభ్యర్థులు ముగియగానే కేయూ మహిళా ఇంజనీరింగ్ కాలేజీలోని వివిధ విభాగాల్లో గోల్డ్‌మెడల్స్ సాధించిన అభ్యర్థులు (వీరికి కాలేజీలోనే బంగారు పతకాలు ఇచ్చారు) తమ గోల్డ్‌మెడల్స్ తీసుకొని వేదిక పైకి బ్యాచ్‌లవారీగా, విభాగాల వారీగా రాగా, గవర్నర్ వారితో గ్రూప్ ఫొటోలు దిగారు. 373మంది అభ్యర్థులకు 564 గోల్డ్ మెడల్స్ ప్రదానం చేయాల్సి ఉండగా 446 బంగారు పతకాలు ప్రదానం చేశారు.

విలువలు, నైపుణ్యాలు రెండూ అవసరమే

స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

- వివరాలు 8లో▸

పట్టాలు, బంగారు పతకాలు అందుకున్న విద్యార్థులు

- మరిన్ని ఫొటోలు: 8లో▸

న్యూస్‌రీల్

అటల్ టింకరింగ్ ల్యాబ్‌లతో సృజనాత్మకత



విద్యారణ్యపురి : విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణలు పెంపొందించేందుకు అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు (ఏటీఎల్) దోహదపడతాయని హనుమకొండ జిల్లా సైన్స్ అధికారి ఎస్. శ్రీనివాసస్వామి తెలిపారు. జిల్లాలోని పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలకు మంజూరైన అటల్ టింకరింగ్ ప్రయోగశాల నిర్వహణకు ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. వీరికి హసన్‌పర్తిలోని బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి శ్రీనివాస్‌స్వామి కోర్సు కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థుల్లో ఆవిష్కరణ, సంస్కృతి, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు దోహదపడతాయని వివరించారు. కోర్సు డైరెక్టర్, జిల్లా గుణాత్మక విద్య కోఆర్డినేటర్ బండారు మన్మోహన్, హెచ్‌ఎం సుమాదేవి, కేంద్రీయ బండార్ హైదరాబాద్ సభ్యుడు బొక్క సతీష్, ఈర్ల అన్వేష్, సుధీర్, ఆర్పీలు పాల్గొన్నారు.

ములుగు వెళ్తున్న బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేల అరెస్ట్



ఆత్మకూరు : ములుగులో బీఆర్‌ఎస్ తలపెట్టిన నిరసన కార్యక్రమానికి వెళ్తున్న ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్ రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేష్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలను సోమవారం ఆత్మకూరు పోలీసులు అరెస్టు చేశారు. ఏసీపీ సతీష్‌బాబు, సీఐ సంతోష్, బీఆర్‌ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ములుగు జిల్లాలో ఇందిరమ్మ ఇల్లు అడిగిన రమేశ్ ఆత్మహత్యకు పాల్పడడం చూస్తుంటే, ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, రాకేష్‌రెడ్డిలు మండిపడ్డారు. ఈ నెల4నుంచి 31 వరకు పోలీస్‌యాక్ట్ పెట్టడం చూస్తే దొంగచాటు ఆంక్షల్లాగా కనిపిస్తున్నాయన్నారు. మంత్రి సీతక్క అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు.

రేపు ఏనుమాముల మార్కెట్ బంద్

వరంగల్ చౌరస్తా : వరంగల్‌లోని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ఈనెల 9న (బుధవారం) బంద్ ఉంటుందని ఉన్నత శ్రేణి కార్యదర్శి గుగులోత్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు గ్రేయిన్ మార్కెట్ గుమాస్తాల సంఘం, సీఐటీయూ, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. పలు యూనియన్లు సమ్మె నోటీసు అందజేయడం జరిగిందన్నారు. అందువల్ల రైతులు, వ్యాపారస్తులు, గుమస్తాలు, దడువాయిలు, కార్మికులు సహకరించాలని కోరారు. 10న మార్కెట్ పునఃప్రారంభమవుతుందని కార్యదర్శి గుగులోత్ రెడ్డి తెలిపారు.

ఖాదీ వస్త్రాలు ధరించి ప్రజావాణికి హాజరవ్వాలి

- అధికారులకు వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద సూచన
- గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అర్జీల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యశారద

న్యూశాయంపేట: ప్రజావాణికి హాజరయ్యే ప్రతీ అధికారి ఖాదీ వస్త్రాలు ధరించాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అన్నారు. సోమవారం ప్రజావాణిలో భాగంగా కలెక్టరేట్‌లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. త్వరగా సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 78 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూశాఖకు 37, కలక్టరేట్‌కు 6, పంచాయతీరాజ్ శాఖకు 6, మిగతా శాఖలకు సంబంధించి 29 వినతులు అందినట్లు తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవన భృతి పెంపొందించేందుకు ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ అధికారి ఆయా స్టాళ్లను సందర్శించి వస్తు సామగ్రిని కొంటే సంఘాలకు ప్రోత్సాహం కల్పించవచ్చన్నారు. కాగా, ప్రభుత్వం జారీ చేసిన పని గంటల జీఓ నంబర్ 282ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘాలు కలెక్టర్‌కు వినతి పత్రం అందించాయి. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో వివిధ శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కార్పొరేషన్ బోర్డు జాబితాలో చేర్చాలని మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

డీట్(డీఈఈటీ) వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఇండస్ట్రియల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ తెలంగాణ (డీట్) వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. నిరుద్యోగ యువతకు, నైపుణ్యం కలిగిన వ్యక్తులకు శుభవార్తగా పేర్కొన్నారు.

మహిళలకు అన్ని రంగాల్లో అధిక ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ఈఅవకాశాలను మహిళలు వినియోగించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో భాగంగా సోమవారం వరంగల్ డీఆర్డీఓ. జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన మహిళా సంఘాల సభ్యుల సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. మంగళవారం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో, బుధవారం గ్రామ స్థాయిలో సంబురాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని సభ్యులకు పలు సూచనలిచ్చారు. సమావేశంలో డీఆర్డీఓ. కౌసల్యాదేవి, అదనపు డీఆర్డీఓ రేణుకాదేవి, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

- సంస్థాగత నిర్మాణంపై పార్టీ దృష్టి
- వీరి ఆధ్వర్యంలో గ్రామ, మండల, జిల్లా కమిటీలు!




లక్ష్మణ్‌కుమార్

సాక్షిప్రతినిధి, వరంగల్: సంస్థాగత నిర్మాణం, స్థానిక సంస్థల ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం దృష్టి సారించింది. గ్రామ స్థాయి నుంచి జిల్లా వరకు పార్టీని మరింత బలోపేతం చేయడంపై కసరత్తు చేస్తోంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇటీవల పర్యటన తర్వాత ఆ పార్టీ హైకమాండ్ దూకుడు పెంచింది. ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గాలకు నియమించిన అధిష్టానం.. సోమవారం ఉమ్మడి జిల్లాలకు ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఈక్రమంలో ఉమ్మడి వరంగల్‌కు పార్టీ ఇన్‌చార్జ్‌గా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను నియమించారు. జగిత్యాల జిల్లా ధర్మపురి నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన లక్ష్మణ్‌కుమార్ గతంలో ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ చైర్మన్‌గా.. 2023లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ విప్‌గా నియమితులయ్యారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో ఆయనకు చోటు దక్కగా, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖను కేటాయించారు. నల్లగొండ ఇన్‌చార్జ్ మంత్రిగా కూడా ఉన్న లక్ష్మణ్‌కు ఉమ్మడి వరంగల్ పార్టీ ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. ఉమ్మడి వరంగల్‌లో ఇటీవల నెలకొన్న గ్రూపు రాజకీయాల నేపథ్యంలో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ సోమవారం లక్ష్మణ్‌కుమార్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. కాగా.. మరో రెండు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికల ఘట్టం మొదలవనుండగా.. సమర్థంగా ఎదుర్కొనేందుకు సంస్థాగత కమిటీలు పూర్తి చేసేందుకు అన్ని స్థాయిల్లో కసరత్తు జరుగుతున్నట్లు చెబుతున్నారు. ఈక్రమంలోనే ఉమ్మడి జిల్లాల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమించిన అధిష్టానం.. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే వీరి ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు, ఎమ్మెల్యేల సమన్వయంతో గ్రామ, మండల, జిల్లా కమిటీలను పూర్తి చేసే బాధ్యతలను అప్పగించినట్లు పార్టీవర్గాల్లో చర్చ జరుగుతోంది.

బలాకా, విజయా క్రమాల్లో అమ్మవారికి పూజలు





బలాకా, విజయా అమ్మవారిగా అలంకరణ

హన్మకొండ కల్చరల్ : భద్రకాళి దేవాలయంలో నిర్వహిస్తున్న శాకంబరీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పన్నెండో రోజు సోమవారం అమ్మవారికి బలాకా, విజయా క్రమాల్లో పూజలు చేశారు. అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేదపండితులు ఉదయం అమ్మవారికి పూర్ణాభిషేకం, నిత్యాహ్నికం నిర్వహించారు. అనంతరం కాళీక్రమాన్ని అనుసరించి స్నపనబేరాన్ని బలాకా అమ్మవారిగా, షోడశీ క్రమాన్ని అనుసరించి భోగబేరాన్ని విజయా అమ్మవారిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ శేషుభారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు ర్యాలీ..


మహబూబాబాద్ శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నేడు (మంగళవారం) ఉదయం 9గంటలకు ట్రస్ట్ సభ్యులు కూరగాయలతో కాశీబుగ్గ నుంచి ర్యాలీ చేపట్టనున్నారు. పోచమ్మ మైదాన్ జంక్షన్ నుంచి బయలుదేరి భద్రకాళి దేవాలయానికి చేరుకొని అమ్మవారికి కూరగాయలు సమర్పిస్తారని ఈఓ శేషుభారతి తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్ : నిరుద్యోగ ఎంబీసీ యువత కు స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి లక్ష్మణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీఎంబీసీడీసీ హైదరా బాద్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు ఉచి త స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ అందజేస్తారని పేర్కొన్నారు. నిరుద్యోగులు ఈనెల 12వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో tgobmms.cgg.gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మాట్లాడుతున్న మేయర్ సుధారాణి, కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, సమావేశంలో చాహత్ బాజ్‌పాయ్







చర్చల్లేవ్.. ఆమోదించడమే..!

సర్వ 'తీర్మానాల' గ్రేటర్ వరంగల్ కౌన్సిల్ సమావేశం

- రూ.149.29కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం
- విలీన గ్రామాల్లో 60 గజాల్లోపు ఇళ్లకు చెత్త పన్ను మినహాయింపు
- వాకౌట్ చేసిన పలువురు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు
- అందరికీ సమన్యాయం చేస్తున్నామన్న మేయర్ సుధారాణి



ఆధునికీకరించిన కౌన్సిల్ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, మేయర్ సుధారాణి



సమావేశంనుంచి వాకౌట్ చేసి బయటికి వచ్చి నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు

వరంగల్ అర్బన్ : ఎజెండాలోని అంశాలపై పెద్దగా చర్చలేకుండానే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కౌన్సిల్ సమావేశం ముగిసింది. విలీన గ్రామాల్లో 60 గజాల్లోపు స్థలంలోని ఇళ్లకు చెత్త పన్ను మినహా అన్నీ తీర్మానాలను ఆమోదించారు. సోమవారం బల్దియా కౌన్సిల్ సమావేశం కొత్తగా ఆధునికీరించిన హాల్‌లో మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన జరిగింది. ఎజెండాలోని అంశాలను ప్రవేశపెట్టారు. నలుగురైదుగురు కార్పొరేటర్లు మినహా ఎవరూ ప్రశ్నలు సంధించలేదు. బీఆర్‌ఎస్‌కు చెందిన కొందరు కార్పొరేటర్లు వాకౌట్ చేశారు. ముందుగా ఇటీవల మెరుగులుదిద్దిన కౌన్సిల్ హాల్‌ను మేయర్, ఎక్స్ అఫిషియో సభ్యులు ప్రారంభించారు.

రూ.149.29కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

బల్దియా సర్వసభ్య సమావేశం..ఈసారి ఆద్యంతం అభివృద్ధి ప్రధానంగా సాగింది. రూ.149.29కోట్ల పనులకు, 23 ఎజెండా అంశాలకు ఆమోదం పలికారు. జనరల్ ఫండ్ రూ.62.15కోట్లు కేటాయించగా, అందులో నగరవ్యాప్తంగా ఉన్న 66వ డివిజన్లకు రూ.50లక్షల చొప్పున రూ.33కోట్లు కేటాయించారు. ఇతర అభివృద్ధి పనులకు రూ.24.05కోట్లు, పన్నెండు మోరీల జంక్షన్ విస్తరణ, అభివృద్ధికి రూ.2కోట్లు, వీధి దీపాలకు రూ.2కోట్లు అంగీకరించారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.18.18కోట్లు అభివృద్ధి పనులకు కేటాయించారు. స్టాంపు డ్యూటీ విడుదలైన నిధుల్లో రూ.41.56కోట్లతో పలు పనులు చేపట్టనున్నారు. అదేవిధంగా రూ.14.కోట్లతో ఇతర అభివృద్ధి పనులకు కౌన్సిల్ పచ్చజెండా ఊపింది.

చర్చకు పట్టు.. బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల వాకౌట్

ఎజెండాలోని అంశాల్లో భద్రకాళి మాఢ వీధులు, మ్యూజికల్ లైటింగ్‌కు నిధుల అంశం ప్రస్తావనకు రావడంతో బీఆర్‌ఎస్ కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్ రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల్లో అవినీతి జరిగిందంటూ చర్చకు పట్టుపట్టారు. యూజీడీకి నయాపైస మంజూరు చేయలేదని విమర్శించారు. ఇరిగేషన్, 'కుడా' చేస్తున్న పనులను కౌన్సిల్‌లో లేవనెత్తడం సరికాదని, మేయర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వారించారు. దీంతో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, ఇండ్ల నాగేశ్వర్ రావు, లావుడ్య రవి, చెన్నం మధు, మనీషా, కిరణ్, సంకు నర్సింగ్, బొమ్మ అశోక్ నిరసన వ్యక్తం చేస్తూ సమావేశంనుంచి వాకౌట్ చేశారు. మరికొంత మంది బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, స్వరూప రాణి, మరుపల్లి రవి,అవాల రాధిక రెడ్డి, దివ్య రాణి తదితరులు సమావేశం ముగిసేంత వరకు ఉండడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ సమావేశంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, కార్పొరేటర్లు, వింగ్ అధికారులు పాల్గొన్నారు.

సభ్యులు ఎవరెమన్నారంటే..

- అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్ జక్కుల రవీందర్ మాట్లాడుతూ ఫిల్టర్‌బెడ్‌లో మోటార్లు తరచూ కాలిపోతుండటంతో నీటిసమస్య ఉత్పన్నమవుతుందని, చెత్త వాహనం మరమ్మతులు వస్తే ఎప్పుడు బాగు చేస్తారో తెలియదని అన్నారు. క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బంది తమ మాటకు విలువ ఇవ్వడం లేదని, డివిజన్లకు నిధుల కేటాయింపులో వివక్ష చూపిస్తున్నారని, క్వాలిటీ కంట్రోల్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు.
- దీనిపై ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జోక్యం చేసుకొని 'కుడా' నిధులు రూ.1.50 కోట్లు కేటాయించామని, ఎలాంటి వివక్ష లేదన్నారు.
- మరో సభ్యుడు తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శ్మశాన వాటికకు నిధులు కేటాయించాలని అన్నారు.
- బీజేపీ కార్పొరేటర్ చాడ స్వాతి మాట్లాడుతూ రాష్ట్రంతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా నిధులు కేటాయిస్తోందని, సమావేశంలో కనీసం చర్చించకపోవడం సరికాదన్నారు.
- అదే పార్టీకి చెందిన మరో కార్పొరేటర్ బైరి లక్ష్మి మాట్లాడుతూ కంకరపోసి పనులు వదిలేస్తున్నారన్నారు. విలీన గ్రామాల్లో 60గజాల స్థలంలోపు ఉన్న ఇళ్లకు చెత్తపన్ను మినహాయింపు ఇస్తూ తీర్మానాన్ని సవరించాలని కోరగా, మేయర్ అంగీకరించారు.

అన్ని డివిజన్లకు సమన్యాయం

వివక్ష లేకుండా రాజకీయపార్టీలకతీతంగా అన్ని డివిజన్లకు సమానంగా నిధులు కేటాయిస్తున్నాం. సీఎం రేవంత్ రెడ్డి చొరవతో గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్టాంపు డ్యూటీ నిధులు నగరానికి రూ.173కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులతో కనివిని ఎరుగని రీతిలో అభివృద్ధి చేస్తాం. బీఆర్‌ఎస్ కార్పొరేటర్లకు అభివృద్ధి కనిపించడం లేదు. అందుకే వాకౌట్ చేశారు.

– గుండు సుధారాణి, మేయర్

వాటర్ బోర్డు ప్రతిపాదించండి..

బల్దియాకు వాటర్ బోర్డు ఏర్పాటుకు తీర్మానం చేసి, అందరం కలిసి సీఎం దృష్టికి తీసుకెళ్లి సాధించుకోవాలి. స్కాడ్ విధానం అమలుచేయాలి. విద్యుత్ లైట్ల నిర్వహణకు డిప్యూటేషన్‌పై ఎన్‌పీడీసీఎల్ నుంచి ఈఈని తీసుకోవాలి. ఆటోనగర్ శ్మశానవాటికకు నిధులు కేటాయించాలి. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి.

– బస్వరాజు సారయ్య, ఎమ్మెల్సీ

కాగితాలు, కొబ్బరికాయలతో కాలం వెళ్లదీశారు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాగితాల్లో లెక్కలు చూపించి, కొబ్బరికాయలు కొట్టారు. నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారు. కాళోజీ కళాక్షేత్రం, కాజీపేట ఫ్లై ఓవర్ బ్రిడ్జి, నయీంనగర్ నాలా, భద్రకాళి పూడికతీత, మాఢ వీధులకు నిధులు మంజూరు చేస్తే ఓర్వలేక పసలేని ఆరోపణలు చేస్తున్నారు. అభివృద్ధి పనుల పేరిట పందికొక్కుల్లా ప్రజాధనాన్ని దోచుకున్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించారు. అందుకే కేయూలోని సీఆర్‌పీఎఫ్ స్థలంలో రెసిడెన్షియల్ నిర్మించేందుకు కృషి చేస్తున్నాం.


– నాయిని రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే

1/3 నిధులు విలీన గ్రామాలకు కేటాయించాలి..

మున్సిపల్ చట్టంలో విలీన గ్రామాల అభివృద్ధికి 1/3 నిధులను కేటాయించాలి. ఆఅంశాన్ని దృష్టిలో పెట్టుకుని నిధులను కేటాయించి, గ్రామాల్లో సిటీ వాతావారణం దిశగా చర్యలు చేపట్టాలి.

– కేఆర్ నాగరాజు, ఎమ్మెల్యే, వర్ధన్నపేట

జిల్లాలో మోస్తరు వర్షం



హన్మకొండ : హనుమకొండ, వరంగల్ జిల్లాలో తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. సోమవారం ఉదయం వరకు నమోదైన వర్షపాతం వివరాలను వాతావరణ శాఖ విడుదల చేసింది. హనుమకొండ జిల్లాలో సగటున 20.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వరంగల్ జిల్లాలో సగటున 14.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. హనుమకొండ జిల్లాలో అత్యధికంగా శాయంపేటలో 41.9 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. నడికుడలో 32.2, ఆత్మకూరు-30.5, పరకాల- 31.1, కమలాపూర్-32.7, హసన్‌పర్తి-21.7, భీమదేవరపల్లి-21, ఐనవోలు-10, వేలేరు-9.1, కాజీపేట-7.2, హనుమకొండ-6.1, ధర్మసాగర్‌లో 1.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. వరంగల్ జిల్లా దుగ్గొండిలో అత్యధికంగా 42.3 మిల్లీ మీటర్లు, గీసుకొండ-8.3, నల్లబెల్లి-30.4, నర్సంపేట-18.1, ఖానాపూర్-16.1, చెన్నారావుపేట-9.2, సంగెం-6.2, వర్ధన్నపేట-10.8, రాయపర్తి-5.7, పర్వతగిరి-8.3, నెక్కొండ-12.5, ఖిలా వరంగల్-5.6, వరంగల్‌లో 14.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

నిట్‌లో గవర్నర్‌కు ఘన స్వాగతం

కాజీపేట అర్బన్ : కేయూ స్నాత కోత్సవం సందర్భంగా సోమవారం నగరానికి విచ్చేసిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ.. నిట్ వరంగల్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారద, స్నేహ శబరీశ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, సీపీ సన్‌ప్రీత్‌సింగ్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, 'కుడా' చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి పూల మొక్క అందజేసి గవర్నర్‌కు ఘన స్వాగతం పలికారు.


గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ స్నేహశబరీశ్


జాతీయ గీతం ఆలపిస్తున్న పట్టభద్రులు, కుటుంబ సభ్యులు, వారి బంధువులు


పీహెచ్‌డీ పట్టాలు అందుకున్న అభ్యర్థులు

విద్యార్థి సంఘాల బాధ్యుల ముందస్తు అరెస్ట్

కేయూ క్యాంపస్: కేయూ స్నాతకోత్సవం నేపథ్యంలో సోమవారం తెల్లవారుజామున వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు 13 మందిని పోలీసులు ముందుస్తు అరెస్ట్ చేశారు. మధ్యాహ్నం 1.30 గంటలకు స్నాతకోత్సవం ముగిసిన అనంతరం గెస్ట్‌హౌజ్‌లో గవర్నర్ లంచ్ చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు పోలీస్ అధికారులు ఆయా విద్యార్థి సంఘాల బాధ్యులను గవర్నర్ వద్దకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు కేయూ భూములు కేటాయించొద్దని విన్నవించి వినతిపత్రం సమర్పించారు. అలాగే, యూనివర్సిటీకి సంబంధించిన పలు సమస్యలను కూడా పరిష్కరించాలని ఆ వినతిపత్రంలో కోరారు.

విలువలు, నైపుణ్యాలు రెండూ అవసరమే

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ | కనులపండువగా కేయూ స్నాతకోత్సవం

కేయూ క్యాంపస్: విలువలు, నైపుణ్యాలు రెండు అవసరమేనని, వృత్తిపర విజయానికి విలువలతో కూడిన జీవితంపై విద్యార్థులు దృష్టిసారించాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించిన కేయూ 23వ స్నాతకోత్సవంలో గవర్నర్.. చాన్స్‌లర్‌గా పాల్గొని మాట్లాడారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం మాటలను గుర్తుచేస్తూ విజయం కోసం కష్టాలు అవసరం అన్నారు. వైఫల్యాలకు భయపడకుండా దానిలోని విజయం కోసం బీజాలు పండించాలన్నారు. మనిషి జీవితంలో ఇబ్బందులు వస్తుంటాయన్నారు. ఎందుకంటే ఆ విజయాన్ని ఆస్వాదించేందుకు ఇబ్బందులు అవసరమన్నారు. వైఫ్యలానికి భయపడొద్దన్నారు. వైఫల్యాన్ని ఆలింగనం చేసుకోండి.. దానినుంచి నేర్చుకోండి.. ప్రతి అడ్డంకికి మీ మెట్టు మారనివ్వండి అన్నారు. 21వ శతాబ్దానికి నైపుణ్యాలు అవసరమన్నారు. విమర్శనాత్మక ఆలోచనలు, సృజనాత్మకత, సహకారం ఉత్సుకత, కమ్యూనికేషన్ వంటి ఐదు 'సీ'లను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. యువత విజయానికి అవే మార్గదర్శకాలన్నారు. కాకతీయ యూనివర్సిటీ యాభై సంవత్సరాల క్రితం స్థాపించినప్పుడు ఇది ఉత్తర తెలంగాణకు ఉన్నత విద్యలో రూపాంతర ప్రయాణానికి నాందిపలికిందన్నారు. 672 ఎకరాల్లో విస్తరించి ఉందన్నారు. 27 విభాగాలతో 500కుపైగా కళాశాలలను కలిగి ఉందన్నారు. విశ్వవిద్యాలయం విస్తృత విద్యావ్యవస్థగా ఎదిగిందన్నారు. 2023 కేయూ న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించిందన్నారు. 2024లో ఎన్ఐఆర్ఎఫ్‌లో 151–200 ర్యాంకు సాధించిందన్నారు. ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజీ జాతీయస్థాయిలో 84వ స్థానంలో ఉందన్నారు.




స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, వీసీ ప్రతాప్‌రెడ్డి

ఈ విజయాలు పరిమిత వనరుల మధ్య విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు కృషికి ఫలితమన్నారు. డీఎస్‌టీ, సీఎస్ఐఆర్, ఐసీఎంఆర్, యూజీసీ, ఐసీఎస్ఆర్ ఏజెన్సీల మద్దతు కూడా గుర్తుచేశారు. మీ స్వప్నాల వేటకు ఇది మేల్కొనే క్షణమన్నారు. మీరు కేవలం డిగ్రీలు పొందలేదని ఒక బాధ్యత, ఆశయాన్ని దేశాభివృద్ధిలో భాగస్వామిగా మారే అవకాశాన్ని స్వీకరించారన్నారు. కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం విద్య, వికాసం, ఆశ, నూతన ఆరంభాలకు ప్రతీకగా నిలిచిందన్నారు. కేరీర్‌లోనే కాకుండా భవిష్యత్‌లో ఇంకా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రారంభంలో పీహెచ్‌డీ పట్టభద్రులకు, గోల్డ్‌మెడల్స్ సాధించిన వారికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అభినందనలు తెలిపారు.

మీడియం అవరోధం కాదు.. ప్రశ్నలడగడం నేర్చుకోవాలి

కాకతీయ విశ్వవిద్యాలయం 23వ స్నాతకోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సమాజ నిర్మాణానికి విద్యార్థుల శక్తిని ఉపయోగించాలన్నారు. భాషామాధ్యమం మన అభివృద్ధికి అవరోధం కాదని, విజేతలుగా విద్యార్థులు నిలవడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితుల పాత్ర ను గుర్తుచేస్తూ విద్యార్థుల విజయం వెనుక తల్లిదండ్రులు, గురువుల పాత్ర కూడా ఉందన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి తన సొంత జీవన ప్రయాణాన్ని పంచుకున్నారు. తనది నల్లగొండలో చిన్న గ్రామమన్నారు. తెలుగు మీడియంలో డిగ్రీ వరకు విద్యనభ్యసించి ఇంగ్లిష్‌తో పోరాడుతూ పేపర్ బాయ్‌గా పని చేసిన అనుభవాలను వివరించారు. తాను ఐఐసీటీ డైరెక్టర్‌గా ఎదిగిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రతి విద్యార్థికి 'మీ గతం కాదు, మీ లక్ష్యానికి మీరు చేసే ప్రయాణమే అసలైన నిర్వచనం' అని సందేశమిచ్చారు.

కేయూ అభివృద్ధి పనులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు..

కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి.. యూనివర్సిటీ విద్యాపరంగా, పరిశోధనపరంగా, అభివృద్ధి పరంగా ఎదుగుతున్న తీరు రిపోర్టు రూపంలో అందించారు. కేయూ న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ కలిగి ఉండి 50 సంవత్సరాలు పూర్తిచేసుకోబోతోందని, గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు కూడా నిర్వహించుకోబోతున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి పనులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు కూడా తెలిపారు. స్నాతకోత్సవంలో రిజిస్ట్రార్ వి. రామచంద్రం, డీన్లు గాదె సమ్మయ్య, బి.సురేశ్‌లాల్,జి. హనుమంతు, శ్రీనివాస్, సదానందం, కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, సెనెట్ సభ్యులు, మాజీ వీసీలు ఎన్. లింగమూర్తి, బి.వెంకటరత్నం, అంపశయ్య నవీన్, కేయూ పాలకమండలి సభ్యులు మల్లం నవీన్, సుకుమారి, అనితారెడ్డి, బాలు చౌహాన్, సుదర్శన్, రమ, చిత్రరాజు, తదితరులు పాల్గొన్నారు. పీహెచ్‌డీ అవార్డులు పొందని అభ్యర్థులకు డాక్టరేట్ పట్టాలు, వివిధ కోర్సుల్లో గోల్డ్‌మెడల్స్‌సాధించిన అభ్యర్థులకు గోల్డ్‌మెడల్స్‌ను రాష్ట్రగవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ.. శ్రీనివాస్‌రెడ్డి, వీసీ ప్రతాప్‌రెడ్డితో కలిసి ప్రదానం చేశారు.

గవర్నర్‌కు చేనేత జ్ఞాపిక అందజేత



న్యూశాయంపేట: వరంగల్ పర్యటనలో భాగంగా హనుమకొండ కలెక్టర్‌లో సోమవారం టీబీపై జరిగిన సమావేశానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హాజరయ్యారు. ఓరుగల్లు ప్రత్యేకత గుర్తుండేలా జీఐ ట్యాగ్ పొందిన చపాట మిర్చి, కాకతీయ కళాతోరణం ప్రతిబింబించిన వరంగల్ చేనేత డర్రీ జ్ఞాపికను కలెక్టర్ సత్యశారద.. గవర్నర్‌కు అందజేశారు.


అభ్యర్థినికి పీహెచ్‌డీ పట్టా అందజేస్తున్న గవర్నర్, వీసీ


గవర్నర్ చేతుల మీదుగా పట్టాలు పొందుతున్న అభ్యర్థులు


అభ్యర్థినులకు గోల్డ్‌మెడల్స్ ప్రదానం చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, వీసీ ప్రతాప్‌రెడ్డి




గోల్డ్‌మెడల్స్ అందుకున్న అభ్యర్థినులతో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, వీసీ ప్రతాప్‌రెడ్డి



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా పట్టాలు అందుకుంటున్న అభ్యర్థులు


గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్స్ అందుకుంటున్న అభ్యర్థులు


కేయూ పాలకమండలి సభ్యులు, డీన్లు, సెనెట్ సభ్యులతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి , వీసీ ప్రతాప్‌రెడ్డి

నేడు మానుకోటకు ఉప ముఖ్యమంత్రి, ఐదుగురు మంత్రుల రాక

- మహబూబాబాద్, కేసముద్రంలో రూ. 500 కోట్ల పనులకు శంకుస్థాపన

సాక్షి, మహబూబాబాద్: పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనల నిమిత్తం మంగళవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతోపాటు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ.. మహబూబాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. హెలికాప్టర్‌లో ఉదయం 12 గంటలకు మహబూబాబాద్ రూరల్ మండలం సోమ్లా తండాకు చేరుకుంటారు. అక్కడ రూ. 100కోట్లతో చేపట్టనున్న రోడ్లు, సబ్ స్టేషన్లు, సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్ పనులకు శంకుస్థాపన చేస్తారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ. 1.20కోట్ల విలువైన చెక్కులు అందజేస్తారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అక్కడి నుంచి కేసముద్రం మున్సిపాలిటీకి చేరుకుని అక్కడ రూ. 300 కోట్లతో చేపట్టనున్న డిగ్రీ కళాశాల భవనం, హౌసింగ్ గోదాంలు, కల్వలలో 1322/11 కేవీ సబ్‌స్టేషన్, మట్టివాడ, ఉప్పరపల్లి, కేసముద్రంలో నిర్మించనున్న 32/11 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు. ఈ పర్యటనలో డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్, ఎంపీ బలరాం నాయక్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తదితరులు పాల్గొంటారని మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ సోమవారం తెలిపారు.

గుండెపోటుతో ఈజీఎస్ ఏపీఓ శ్రీనివాస్ మృతి


శ్రీనివాస్‌గౌడ్ (ఫైల్)

పాలకుర్తి టౌన్ : జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన ఈజీఎస్ ఏపీఓ కమ్మగాని శ్రీనివాస్‌గౌడ్(50)గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం ఉదయం మండల కేంద్రంలోని జనగామ రోడ్డులో వాకింగ్‌కు వెళ్లిన శ్రీనివాస్.. గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలారు. స్థానికులు గమనించి వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, శ్రీనివాస్ దేవరుప్పుల మండలంలో ఈజీఎస్ ఏపీఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. డీఆర్‌డీఓ పీడీ వసంత, అడిషనల్ డీఆర్‌డీఓ పీడీ చంద్రశేఖర్.. శ్రీనివాస్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రేవంత్ అసమర్థ పాలనే కారణం..

సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థ పాలన శ్రీనివాస్‌ను హత్య చేసిందని ఏపీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రావు అన్నారు. దేవరుప్పుల మండలంలో ఏపీఓగా విధులు నిర్వర్తిస్తున్న కమ్మగాని శ్రీనివాస్‌గౌడ్ మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. దీంతో మనస్తాపంతో గుండెపోటుకు గురై మృతి చెందారన్నారు. కాగా, ఈజీఎస్ ఏపీఓల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని డీఆర్‌డీఓ పీడీ వసంత హామీ ఇచ్చారు. ఈజీఎస్ కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే..

దేవరుప్పుల : మూడు నెలలు గడిచినా వేతనాలు ఇవ్వకపోవడంతో ఉపాధి హామీ ఏపీఓ కమ్మగాని శ్రీనివాస్ మనోవేదనతో గుండెపోటుకు గురై మృతి చెందారని, ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హత్యే అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఈ మేరకు సోమవారం శ్రీనివాస్ కుటుంబీకులను ఫోన్‌లో పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. నిత్యం కూలీల సంక్షేమం కోసం కృషి చేసే ఉపాధి హామీ పథక ఉద్యోగులకు రెగ్యులర్ వేతనాలు ఇవ్వకపోవడం రేవంత్‌రెడ్డి సర్కారు ఆర్థిక దుస్థితికి నిదర్శనమన్నారు.

'కుడా' వీసీకి శుభాకాంక్షలు



నయీంనగర్ : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం 'కుడా' కార్యాలయంలో చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని మర్యాద పూర్వకంగా వారి చాంబర్‌లో కలిశారు. అనంతరం కమిషనర్‌కు చైర్మన్ వెంకట్రామ్ రెడ్డి పుష్పగుచ్ఛం, పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అడిషనల్ డీసీపీ కిషన్ బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని అడిషనల్ డీసీపీ (ఆపరేషన్స్ అండ్ క్రైం) బోనాల కిషన్ బదిలీ అయ్యారు. ఆయనను డిస్పోజబుల్ జేఎండీ, ట్రాన్స్‌కోకు బదిలీ చేస్తూ డీజీపీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఇటీవలే ఆయన కమిషనరేట్‌కు బదిలీపై రాగా, మరోసారి కావడం చర్చనీయాంశమైంది. కిషన్‌స్థానంలో ఎవరిని నియమించలేదు.

మిల్స్‌కాలనీ పీఎస్‌కు ఇద్దరు పీఎస్‌ఐలు

ఖిలా వరంగల్ : మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌కు సోమవారం నూతనంగా ఇద్దరు ప్రొహిబిషన్ ఎస్ఐలు మహేష్, శ్రవణ్‌కుమార్‌లను కేటాయించారు.

నేడు సెలవు

కేయూ క్యాంపస్: కేయూ 23వస్నాతకోత్సవం నేపథ్యంలో గత ఆదివారం పనిది నంగా పరిగణించడంతో మంగళవారం యూనివర్సిటీకి సెలవుగా ప్రకటించారు. ఈ మేరకు రిజిస్ట్రార్ రామచంద్రం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంబీసీలకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ

న్యూశాయంపేట: జిల్లాలోని నిరుద్యోగ ఎంబీసీ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై నాలుగురోజుల పాటు శిక్షణ అందజేయనున్నట్లు వరంగల్ జిల్లా బీసీ సంక్షేమాధికారి పుష్పలత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ అత్యంత వెనుకబడిన తరగతుల సహకార సంస్థ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో ట్రావెలింగ్ అలవెన్స్, భోజన వసతి కల్పించనున్నట్లు, ఆసక్తిగల అభ్యర్థులు తగిన ధ్రువపత్రాలతో వెబ్‌సైట్ టీజీఓబీఎంఎంఎస్.సిజిజి.జీవోవి.ఇన్‌లో ఈనెల 12లోగా.. దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు బీసీ సంక్షేమాధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కాజీపేటలో రైల్వే ఇన్‌చార్జ్ జీఎం తనిఖీ

- అమృత్ భారత్ పనుల పరిశీలన


లోకోపైలెట్ల డ్యూటీ రోస్టర్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ జీఎం సందీప్‌మాథూర్

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో సోమవారం దక్షిణ మధ్య రైల్వే ఇన్‌చార్జ్ జనరల్ మేనేజర్ సందీప్‌మాథూర్ తనిఖీ చేపట్టారు. ఇటీవల అదనపు జీఎంగా బాధ్యతలు స్వీకరించిన సందీప్ మాథూర్.. మొదటి సారి ప్రత్యేక రైలులో బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లిలో తనిఖీలు చేసుకుంటూ కాజీపేట జంక్షన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా డీఆర్ఎం భర్తేష్‌కుమార్ జైన్‌తో కలిసి కాజీపేట రైల్వే స్టేషన్ అమృత్ భారత్ అభివృద్ధి పనులు, ప్రయాణికుల వెయింటింగ్ హాల్, టాయ్‌లెట్స్‌ను తనిఖీ చేసి నిర్వహణలో లోపాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫుట్‌ఓవర్‌బ్రిడ్జి, ఎస్కలేటర్, లిఫ్ట్ నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతం చేయాలని ఆదేశించారు. లోకోపైలెట్ కార్యాలయం, రూట్‌రిలే ఇంటర్‌లాకింగ్ కార్యాలయంలోకి వెళ్లి సిగ్నల్ రిలేలను తనిఖీ చేశారు. తనిఖీల్లో సికింద్రాబాద్ సీనియర్ డీఓఎం సురేశ్‌రెడ్డి, సీనియర్ డీసీఎం సిఫాలి, సీపీటీఎం ఎలివేందర్ యాదవ్, డీఓఎం జనరల్ సుధీర్, సీనియర్ డీఎస్‌టీఈ ప్రియ అగర్వాల్, డీఈఎన్ సెంట్రల్ ప్రంజల్ కేశర్‌వాణి, ఏసీఎం ఐఎస్ఆర్ మూర్తి, కాజీపేట స్టేషన్‌మేనేజర్ అగ్గి రవీందర్, కాజీపేట సీనియర్ డీఎంఈ డీజిల్ వెంకటకుమార్, సీనియర్ డీఈఈ ఈఎల్ఎస్ సూర్యనారాయణ, ఏడీఈఎన్ సంతోశ్‌కుమార్, ఎస్ఎస్ఈ రాజన్న, ఆర్పీఎఫ్ సీఐ చటర్జీ , జీఆర్పీ సీఐ నరేశ్‌కుమార్ ఉన్నారు. కాగా, ఇన్‌చార్జ్ జీఎంకు కాజీపేట రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచీ కార్యవర్గ సభ్యులు పి.వేదప్రకాశ్, ఎస్.కె.జానీమియా, జి.రాజేశ్వర్, ఎ.సత్యనారాయణ, నరేశ్‌యాదవ్, నాగరాజు, తిరుపతి యాదగిరి.. డీజిల్ కాలనీలో మంచినీటి సమస్య, క్వార్టర్స్‌లో విద్యుత్ సప్లయ్, కార్మికుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా కాజీపేట మజ్దూర్ యూనియన్ ఆల్ బ్రాంచీస్ కోఆర్డినేటర్ నాయిని సదానందం, టెక్నికల్ బ్రాంచ్ సెక్రటరీ ఆర్.సమ్మయ్య ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలపై ఇన్‌చార్జ్ జీఎం సందీప్‌మాథూరుకు వినతి పత్రం అందజేశారు.

కూనూరు హైస్కూల్‌కు | జాతీయ గుర్తింపు గర్వకారణం

- ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి


కూనూరు పాఠశాలకు అవార్డు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి

హన్మకొండ: జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం కూనూరు జెడ్పీ హైస్కూల్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం గర్వకారణమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి హనుమకొండలో కూనూరు జెడ్పీ హైస్కూల్‌కు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. గత డిసెంబర్ 21, 22వ తేదీల్లో కూనూరు పాఠశాలలో 1974 నుంచి 2024 సంవత్సరాలకు చెందిన 50 పదో తరగతి బ్యాచ్‌ల విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమం తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది. దీంతో అవార్డు ప్రదానోత్సవం నిర్వహించగా శ్రీపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. టీచర్ల కృషి, గ్రామస్తులు, పూర్వ విద్యార్థుల సహకారం ఉంటే పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని, దీనికి కూనూరు పాఠశాలే నిదర్శనమన్నారు. కాగా, హెచ్ఎం ఎండీ ఫర్వేజ్‌కు, స్కూల్ అలూమినీ అసోసియేషన్ కమిటీకి అవార్డుతోపాటు ప్రశంస పత్రం, జ్ఞాపికను ఎమ్మెల్సీతోపాటు తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ వెంకటాచారి, జ్యూరి చీఫ్ కోఆర్డినేటర్ టీవీ అశోక్‌కుమార్ అందజేశారు.